# అవమానుషం

సుధాకరం ఉత్సాహంతో పురకలువేస్తూ బస్ ఎక్కాడు. టింగ్ టింగ్ మనే బొమ్మలు రెండూ, ప్లాస్టిక్ గిలక్కాయలూ, రెండు రెడీమేడ్ చొక్కాలూ, పూలూ పండ్లూ. బుల్లి దోమతెరా, చిన్న బూరుగు పరుపూ. ఇవన్నీ చూసి మరదళ్ళూ-అత్తగారూ నవ్వుతారేమో। తనని పరిహాసాలాడ వచ్చును. పురిటికి వెళ్ళిన తరవాత రెండు సార్లు రాజేశ్వరి చాలా జాలిగా వొక్కసారి వచ్చిపొమ్మని ఉత్తరం వ్రాసింది. అయినా శెలవు దొరక్క కొంతా, డబ్బు చేతిలోలేక కొంతా, వెళ్ళలేదు. తియ్యటి ఉత్తరాలైతే రాశాడు. ఇప్పుడు వాళ్ళు నవ్వుతారు. కొడుకు పుట్టగానే పురుకులు పరుగులమీద వచ్చేశాడని. మరదళ్ళు గడుగ్గాయలు. పండుగకు పిలిచినా రాని బావ-బాబు పుట్టాడనగానే పరిగెత్తుకుని వచ్చాడంటారేమో। వాళ్ళట్లా అంటే సుధాకరానికి ఎంతమాత్రమూ కోపంరాదు. పైన లోలోపల చాలా సంతోషం గూడా కలుగుతుంది.

ఈ ఆలోచనలతో వొకరకమయిన తన్మయీభావంతోనే ఏభై మైళ్ళ బస్సు ప్రయాణమూ ఏ మాత్రమూ బడలిక అనిపించలేదు. కాలమూ, దూరమూ కరిగిపోయినయ్ ఏవేవో ఆలోచనల మధ్య.

అత్తగారిది బొత్తిగా పల్లెటూరుకాని చిన్నవూరు బాగా డబ్బున్న ఆసామీలు ఎంతోమంది వున్నారావూళ్ళో. పొగాకు బేరన్లూ, మాగాండ్లూ. డబ్బుచేసి పెడతాయి. అక్కడి పెద్ద మనుషులకు సినిమాహాలుంది. స్కూలుంది. పళ్ళ దుకాణాలున్నాయి. కాఫీ హోటళ్ళు గూడా వున్నాయి. అయితే ఊరు చిన్నది కాబట్టి పల్లెటూరితనం కూడా కొంత కనబడుతుంది. గొర్రెల మధ్య కొమ్ములు తిరిగిన పొట్టేళ్ళలాగా పెంకుటిళ్ళ మధ్య మేడ లున్నాయి. మేకల్లాంటి పూరిళ్ళూ-పాకలూ వున్నాయి. తాటాకు దడులతో మురికినీటి కాలువల ప్రక్కన చింపిరి గుడ్డల్లాంటి గుడిసెలూ వున్నాయి.

ఆఊరుకు రావటం రెండేళ్ళక్రితం అన్నిఇష్టాలనూ మించినఇష్టంగా వుండేది సుధాకరానికి. రాజేశ్వరి అనే చందమామ చిలుకలకొలికి ఇంకా కాపరానికి రాని రోజులన్నమాట అవి.

పదిహేడోరోజున బారసాల చేసుకోవడం పడలేదు. ఆఫీస్ ఇన్‌స్పెక్షన్‌తో ఊపిరి పీల్చుకోటానికైనా వీలుపడిందికాదు. రాజేశ్వరి ఎంతో నిష్ఠూరంగా ఉత్తరం వ్రాసింది. తాను ఉత్తరంతో ఆ కోపాన్ని పోగొట్టు కోలేడని తనకు బాగా తెలుసు. ఆ నిష్ఠూరమూ, మందలింపూ వెనుక ఎంతో ఆశాభంగం వున్నది. తనతో బహుశా పోగానే మాట్లాడదేమో! బ్రతిమాలాలేమో!

సుధాకరం బస్ ఆగగానే గొప్ప ఉద్వేగంతో రెండు చేతుల్లోనూ సంచీ, బుట్టా తీసుకొని దిగటానికి ప్రయత్నించాడు. తన తొందరకూ - ఉద్వేగానికీ తనకే నవ్వొచ్చింది. ఆశ్చర్యం కలిగింది.

అయితే చాలా కోపంవచ్చే సంఘటన గూడా వొకటి జరిగింది. ఆ కోపముతో ఆపాదమస్తకం వొణికిపోయాడు. సరిగా తాను కాలు కింద మోపుతున్నాడో లేదో - మురికితలా - మురికివొళ్ళూ - బురద పూయబడ్డ ఇనుపచువ్వలాటి కుర్రాడొకడు కిందికి దిగకుండా చేయి అడ్డంపెట్టాడు. ఐదుపైసలో-పదిపైసలో ఇవ్వమంటూ కాళ్లుచుట్టుకునేంత దగ్గరగావచ్చాడు. మూడు రోజులనుండి తిండిలేదు అయ్యా పదిపైసలివ్వండి అని జాలి చూపులు పెట్టాడు. డొక్కలెండి. చర్మం జారిపోయి కళ్ళల్లో ప్రాణం నిలుపుకున్న మురికికుక్క - తానిప్పుడే చచ్చిపోవటం ఇష్టంలేదని యెవరినో వేడుకుంటున్నట్లున్నాయి ఆ కుర్రాడికళ్ళు.

తనని కిందికి దిగనివ్వకుండా అటకాయిస్తున్నందుకు ఎంతైనా చీదర కలిగింది సుధాకరానికి. తన వెనకాల ఇంకా దిగవలసినవాళ్ళు - అసహనంతో తోస్తున్నారు. విసుక్కుంటున్నారు. గొణుక్కుంటున్నారు. హెచ్చరిస్తున్నారు. బస్ ఆగగానే బీడీలు కొనుక్కోవటానికి వెళ్లిన కండక్టర్ వచ్చి వాణ్ణి పక్కకు నెట్టేశాడు. దిగవలసిన వాళ్ళందరూ దిగారు. మనస్సంతా అనవసరంగా _ ఏమిటో కార్పణ్యం నిండిపోయింది. ఇందాకటి కుర్రాడెవరినో పీడిస్తున్నట్లున్నది. వాణ్ణి చెడ్డతిట్లు తిట్టారు. భయపడుతూ భయపడుతూనే గజ్జికుక్కలాంటి కుర్రాణ్ణి చూశాడు సుధాకరం. వాడి చూపులూ కలిశాయి. గోడవారగా విస్తరాకు పడటంతో పరిగెత్తే కుక్కలా వాడు సుధాకరం దగ్గరకు పరిగెత్తుకొని వచ్చాడు. బురదనిండి యెండిన తాటిపండులా వుంది వాడితల. విచ్చుకున్న పత్తికాయల్లాంటి కళ్లు - పండుబారిన జిల్లేడాకుల్లాంటి దవడలు. "అయ్యా పదిపైసలివ్వండి. టీ తాగుతాను. మూడురోజులనుంచి అన్నం తినలేదు" అన్నాడు జాలిగా. సుధాకరానికి జుగుప్స కలిగింది. ఇలాంటి వాళ్ళెందుకుపుట్టాలి? అడుక్కుతినటం బాగా అలవాటైపోయింది వీళ్లకు అనిపించింది. బండికిందనో-

కారుకిందనో పడి నలిగి పళ్లు బైటపెట్టి చచ్చిపోయిన కుక్కను గుర్తుకు తెస్తూ పళ్లన్నీబైటపెట్టి ఐదుపైసలైనా ఇమ్మని చేతులు జోడించాడు. ఎదుర్రొమ్ము గుంటలో ఎన్నికన్నీళ్ళు నిండనో కళ్లలోతడి ఆరిపోకుండా వుంటే.

వాడు వదిలేటట్లు లేడని_వెంటనే బండిని కేకేశాడు సుధాకరం. బండివాడు పళ్లబుట్టా, చేతిసంచీ లోపల పెట్టాడు. బుట్టలోంచి తొంగి చూస్తున్న పళ్లవేపు ఆ నిర్భాగ్యుడు బలవంతాన కనుబొమ్మలు పైకెత్తి చూశాడు. బండి ముందుకు కదిలిపోయింది. వాడు తిట్టలేదు. చీత్కరించు కోనూలేదు_ అలిసిపోయిన చూపులతో ఆశ్చర్యం ప్రకటించి - మళ్లీ వెను తిరిగాడు ఎవరినో పట్టుకుందామని. తినబోతున్న అన్నంలో చచ్చిపోయిన పురుగు కనపడినట్లుగా అయింది సుధాకరానికి మాటిమాటికీ వాడే గుర్తు వస్తున్నాడు. ఇంటికి వెళ్లినతరువాతకూడా; తాను వచ్చినందుకు సంతోషం ఉత్సాహం ప్రకటిస్తూనే రాజేశ్వరి చురకలంటిస్తూ మాట్లాడింది. మరదళ్ళు వేళాకోళం చేశారు. అయినా సుధాకరానికి మధ్య మధ్య అలకలన్నీ అట్ట గట్టిన బొమికలన్నీ ప్రోవుపట్టిన కాగితంవలె పలచబారిన వెర్రివాడూ-కుర్ర వాడూ గుర్తువస్తూనే వున్నాడు. చెత్తకుండీలో నూనె మరకలతో చినిగి పోయిన చెత్తకాగితం లాంటి కుర్రవాడు.

రాజేశ్వరి తాంబూలం నోటికందించినప్పుడూ, బాబును వాళ్లో పడుకోబెట్టినప్పుడూ తాత్కాలికంగా మనసులో ఆ కుర్రవాడి ముద్ర చెరిగి పోయింది. కాని, రాత్రి కలత నిద్రలోకూడా పదేపదే గుర్తువచ్చాడు, తాను తప్పుచేశానన్న దుఃఖంకూడా కలిగింది సుధాకరానికి.

పొద్దున్నే అరుగు మీద కూచుని ముఖం కడుక్కుంటున్నాడు. పక్కింటి వీరభద్రయ్యగారు కుక్కలను ఎంతబాగా పెంచుకున్నా నను

కుంటూ చూసి సంతోషిస్తున్నాడు. వాళ్ళింట్లో మాంసం తినరు వాళ్ల జీత గాడు వాటికోసం తెచ్చి ప్రత్యేకంగా వాటిని శ్రద్ధతో పెంచుతాడు. ఈ దరిద్రపు దేశంలో కుక్కలకూ-గుర్రాలకూ వున్న అదృష్టమయినా మనుషులై పుట్టిన కొందరికి లేదు అనిపించింది సుధాకరానికి. ఆ కుక్కలకు పడుకునేందుకు పరుపు లున్నాయి. వీరభద్రయ్యగారి కారులో మొదటి సీటులో కూచుని టౌన్‌కు వెళ్లే యోగ్యత వాటికున్నది. మనుషులీవిధంగా పశువులు గానూ ఇంకాహీనంగానూ ఎందుకు బ్రతుకుతున్నారో! డబ్బు సంపాదించటమే జీవితంలో పరమాదర్శమైపోయిన సంఘం-యెంత నికృష్టమయిన స్థితికి దిగజారిపోయినట్లు! వెనుకటి వ్యవస్థలో డబ్బుకింత చెలామణి వుండేది కాదు-డబ్బు విలువ ధాన్యరూపంలో వినిమయం అవుతున్న వ్యవస్థలో ఇన్ని ఘోరాలు జరిగే అవకాశంలేదు—డబ్బు నాణెం రూపం గానూ-కరెన్సీ రూపంగానూ వినిమయానికి వచ్చేసరికి-వ్యక్తి-ఆస్తిని-డబ్బునూ-ఇళ్లనూ-బంగారాన్ని పెంచటాని కవకాశం కలిగింది. అయినా మళ్లీ పధ్నాలుగవ శతాబ్దంలోకి పోయేందుకు వీలులేదు. వ్యక్తిగతమయిన సంస్కారం-వికాసం-కలగంది సంఘానికి మేలులేదు. ఇన్ని ఆలోచించ గలిగిన తాను నిన్న ఆ దౌర్భాగ్యుడిపట్ల యెందుకట్లా ప్రవర్తించాడు?

వీరభద్రయ్యగారి జీతగాడు-సబ్బుతో వొళ్లుతోమి-కుక్కలకు స్నానం చేయిస్తున్నాడు.

బాబుకప్పుడే నీళ్లుపోశారు-సాంబ్రాణి పొగవేసినట్లుంది—ఇల్లంతా కమ్ముకున్నది సువాసన. న్యూస్ పేపర్ చూస్తు కూచుండిపోయాడు. ఎక్కడికీ వెళ్లలేదు—మధ్యాహ్నం నామకరణం—తతంగమంతా జరిగింది. ఎవరికీ పెద్ద అభినివేశంలేదు యీ ఆచారాలపట్ల-కర్మకాండపట్ల. అయినా ఎవడికి వాడికే భయం-పిరికితనం.

మధ్యాహ్నం భోజనం - అలస్యం కావటమేకాక _ బాగా బరువూ అయింది. నిద్రలేచేసరికి సంజె వాలుతున్నది - కాస్త చల్లగాలికి తిరిగివద్దామని బయలుదేరాడు సుధాకరం. బస్టాండు దాటి రోడ్డుమీద కొద్దిదూరం నడిచివద్దామని అతడి వుద్దేశం.

బస్టాండు వద్దకు వచ్చేసరికి నలుగురూ. ఐదుగురూ గుంపులు గుంపులు గూడి ఏమిటో భయం భయంగా ఘోరమేదో జరిగినట్లుగా మాట్లాడుకుంటున్నారు. సుధాకరం - అక్కడ కిళ్లీకొట్టుదగ్గర నిలబడి సోడాతాగి అతణ్ణి అడిగాడు ఏంజరిగిందని_

కిళ్లీకొట్టతడు చెప్పాడు.

"ధనరాజు గారింట్లో ఇవాళ మిట్టమధ్యాహ్నం గిన్నెలెత్తుక పోతున్న కుర్రాణ్ణి పట్టుకుని. తలావొక దెబ్బవేశారట, కుర్రాడు స్పృహతప్పి పడిపోయినాడు. ఆస్పత్రికి తీసుక వెళ్లారు."

ఒక్కసారిగా సుధాకరానికి - నిన్న తాను బస్ దిగుతున్నప్పుడు_ వెంటబడ్డ కుర్రాడు జ్ఞప్తికి వచ్చాడు.

"ఈ బస్టాండులో అడుక్కుతినే పుల్లలాంటి నల్లటి కుర్రాడు కాదు కదా వాడు" అన్నాడు వుండబట్టలేక.

"వాడే, బాగాకొట్టారు. వాడు దొంగతనం చేసినట్లుగా వొప్పుకొని కాళ్లమీద పడితే బావుండేది. భయం పుట్టివుంటుంది. మాట పడిపోయినట్లుగా_గుడ్లప్పగించి చూస్తూ వుండిపోయాడట."

సుధాకరం ఇక వినలేకపోయాడు. గుండెనిండా ఏమిటో ఉద్వేగం, నీరసం_ఉద్రేకం. పిచ్చిపిచ్చి ఆలోచనలతో కొంతదూరం నడిచాడు.

రోడ్డుకు రెండు వైపులా చింతచెట్లు తల విరబోసుకున్న దయ్యాలని పించాయి. చిన్న కాలవపైన వంతెన గోడపై కూచున్నాడు. ఆ కుర్రాడు గూడా లోకంలో మనుషులంతా పుట్టినట్లే పుట్టివుంటాడు. తల్లీదండ్రీ ఎవరో ఏమయిపోయినారో - తాను చేయని పాపానికి తల్లిదండ్రుల పాపానికి బలై పోతున్నాడుకుర్రాడు. ప్రభుత్వం చేసే అనేకానేకమయిన పాపాలకు ప్రజలు నెత్తీ నోరూ మొత్తుకుంటున్నట్లు. ఈ కుర్రాడిలాగే ప్రజలూ దిక్కు మాలిన చావుచస్తారు. అప్పుడేమవుతుందో.

తూర్పున యెర్రగా ఉదయించిన చంద్రరేఖ - అసహ్యంగా వుంది. మిణుకు మిణుకుమంటూ నక్షత్రా లుదయించాయి. వేల-లక్షల సంవత్సరాలుగా ఇవి ఇట్లా కళ్ళు చికిలించి చూస్తూనే వున్నాయి. భూమిమీద జరిగే ఘోరాలు తమకేమీ పట్టనట్లుగా.

సుధాకరం వెనక్కు తిరిగాడు. ఆ కుర్రాడి సంగతి ఏమయినా తెలిసిందేమో కనుక్కోకుండా వుండలేక పోయాడు.

ఆ కిల్లీకొట్టు దగ్గరే నిలుచుని—వాణ్ణి ఆస్పత్రిలో చేర్చుకున్నారా? అని అడిగాడు. చేర్చుకున్నా డాక్టరుండక పోవచ్చు. మందు లుండక పోవచ్చు అది వేరువిషయం. క్లబ్బులో కూచున్న డాక్టరుగారికికానీ-అత్యవసర పరిస్థితుల్లో కావల్సిన ఖరీదైన మందులను _ బయట అమ్ముకునే కాంపౌండర్‌కు కానీ_కష్టం తెచ్చిపెట్టకుండా - మెల్లెక్కుతున్నప్పుడే కుర్రాడు ప్రాణాలు విడిచాడుట.

సుధాకరానికి, షాక్ తగిలినట్లయింది. బట్టలకెవరో మంటలంటించినట్లయింది. నాలుక తడారిపోయింది.

నెమ్మదిగా అడుగులో అడుగు వేసుకుంటూ నడిచాడు. "మూడు రూపాయల పళ్ళు కొన్నాడు తాను ఇక్కడికి వచ్చేప్పుడు. అందులో

ముగ్గి పాడై పోయాయని పొద్దున ఐదారు మరదలు బయట పారవేస్తుంటే చూశాడు. పదకొండు రోజుల పసికందుకు ఇరవై రూపాయల రెడీమేడ్ బట్టలు తెచ్చాడు. తన భార్యకు తెచ్చినచీర ఖరీదు ముప్పైఅయిదు రూపాయలు. దొంగ వ్యాపారాలు చేసే పెద్ద మనుష్యులు-ఇంకా ఐదారు వందలు ఖర్చుపెట్టవచ్చును ఇలాంటి సందర్భాలలో. తాను చేసిందేమిటి? ఆకుర్రాడికి వొక్క-రూపాయి - లేదా అర్ధ - కనీసం నాలుగణాలు ఇవ్వలేక పోయినాడు.

మధ్యాహ్నం నిద్రలేస్తూ వుండగా - ముసలి ఏనుగు నడవలేక నడుస్తున్నట్లు గరిమనాభిని సరిగ్గా నిర్ణయించలేని శరీరంతో - కుటుంబ నియంత్రణ ప్రచారోద్యోగిని వచ్చింది ఇంటికి. చూస్తే అసహ్యమేసింది.

పిల్లల్ని కనొద్దనీ - పొదుపు చెయ్యమనీ - చేసేప్రచారం బదులు నికృష్టంగా బ్రతుకుతున్న వాళ్ళు ఎందుకట్లా బ్రతుకుతున్నారన్న జిజ్ఞాస చెయ్యరేం ?

ఏ ఊళ్ళోనూ అన్నం తినకుండా యెవరూ వుండకూడదని ప్రచారం చెయ్యరేం ?

తాను చేసింది మాత్రం ఏమిటి ?

వాడన్నం తినలేదని తనని వేడినప్పుడు తను చేసిందేమిటి ?

ఒక్క రూపాయి వొక్క ప్రాణాన్ని రక్షించి వుండేనా ? కడుపు నిండా తిని ఏ మురిక్కాలువ తూముగట్టుపైనో, ఈ దేశాన్ని శపిస్తూ వాడు పడివుండేవాడు కదా ? ఇప్పుడు లేడు.

సుధాకరానికి తాను చాలా తప్పుచేశానన్న దుఃఖం మాత్రంపోలేదు అటు తరువాత.